కార్పొరేట్లకు ఏజెంటుగా కేంద్ర పాలకులు

- లేబర్ కోడ్‌లను త్వరగా తేవాలని ప్రధాని మోడీపై కార్పొరేట్ల ఒత్తిడి
- అవి వస్తే కార్మికులకు ఉరితాళ్లే
- దేశసంపదను కాపాడేందుకు దేశభక్తులంతా కలిసిరావాలి
- మే 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : ఎం సాయిబాబు

సదస్సులో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు బడా కార్పొరేట్లకు ఏజెంట్లుగా పనిచేస్తున్నారని సిఐటియు అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు విమర్శించారు. లేబర్‌కోడ్‌లను త్వరగా అమల్లోకి తీసుకొచ్చి తమకు ఆర్థిక ప్రయోజనాలు మరింత చేకూర్చాలని మోడీ సర్కారుపై కార్పొరేట్లు ఒత్తిడి తెస్తున్న తీరును ఎండగట్టారు. కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులకు ఉరితాళ్లుగా మారుతాయని హెచ్చరించారు. దేశ సంపదను కాపాడుకునేందుకు, మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టేందుకు, లేబర్‌కోడ్‌లను అడ్డుకునేందుకు దేశభక్తులంతా కార్మిక పోరాటాల్లో కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఎఐటియుసి జాతీయ నాయకులు వీఎస్.బోస్ అధ్యక్షత వహించగా.. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేసి ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందని నొక్కి చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి నేడు ప్రమాదంలో పడిందన్నారు. వాజ్‌పేయి హయాంలోనే బాల్కొని కంపెనీని 1996లో ప్రయివేటు శక్తులకు కట్టబెట్టారని గుర్తుచేశారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో డిస్‌ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా మంత్రిగా బాలశౌరిని నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ ప్రధాని అయ్యాక విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పోస్కో కంపెనీకి కట్టబెట్టేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్న తీరును వివరించారు. కానీ, అక్కడ ఉద్యోగులు అంతేస్థాయిలో ప్రతిఘటిస్తూ 1200 రోజులుగా బలమైన పోరాటం చేస్తున్నారని చెప్పారు. ప్రతిఘటనా పోరాటాలు బలంగా ఉన్న దగ్గర పాలకుల విధానాలను తిప్పికొట్టొచ్చని ఆ ఘటన రుజువు చేస్తున్నదన్నారు. మోడీ ప్రధాని అయ్యాక 4,40,000 కోట్ల రూపాయల ప్రభుత్వ పరిశ్రమల్లో డిసిన్వెస్ట్‌మెంట్ చేసిన తీరును ఎండగట్టారు. 246 పబ్లిక్ సెక్టార్ల దగ్గర 12 లక్షల కోట్ల రూపాయల నిల్వలున్నాయనీ, వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతి ఏటా ప్రభుత్వానికి రూ.5 లక్షల కోట్ల పన్నులు కడుతున్నాయనీ, విదేశీ మారక నిల్వల ద్వారా మరో లక్షన్నర కోట్ల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నాయని వివరించారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఎన్‌ఎంపీ ద్వారా ప్రయివేటు పరం చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. మరోవైపు వాటిలో కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్వీర్యం చేయాలని చూస్తున్న తీరును బీఎస్ఎన్ఎల్, సింగరేణి సంస్థలను ఉదాహరణలుగా చూపెట్టి వివరించారు. రోడ్లు, గోడౌన్లు, బీఎస్ఎన్ఎల్ టవర్లు, విద్యుత్ కేంద్రాలు ప్రయివేటు కంపెనీలకు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల కంట్రోల్‌లో దేశం ఉందనీ, వారి చెప్పినట్టు కేంద్రంలోని బీజేపీ పాలకులు నడుచుకుంటున్నారని విమర్శించారు. ప్రజా తిరుగుబాటు రాకుండా విద్వేషాలు రెచ్చగొడుతూ విభజన రాజకీయాలు చేస్తున్న తీరును ఎండగట్టారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక యూనియన్లు పెట్టుకునే అవకాశముండనీ, మెరుగైన వేతనం, కనీస సౌకర్యాల కోసం ధర్నాలు, సమ్మెలు చేసే హక్కులు కోల్పోయే ప్రమాదముం దని హెచ్చరించారు. బడ్జెట్‌లో కేంద్రం కార్పొరేట్లకు లబ్ధి చేకూరుస్తూనే మరోవైపు కార్మికుల సంక్షేమం విషయంలో కోతలు పెడుతున్న తీరును ఎండగట్టారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పథకం ఉపసంహరణ తదితర అంశాలపై మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను ప్రభుత్వ రంగ సంస్థల్లో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక కోడ్‌ల వల్ల తలెత్తనున్న ప్రమాదాలను వివరించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ మాట్లడుతూ రాష్ట్రంలోని అనేక సీపీఎస్‌యులలో ప్రభుత్వ ఆర్డర్లు లేక ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. 2025-26లో రూ. 47,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడం అన్యాయమన్నారు. కార్మికవర్గం ఎదురుతిరిగితే ప్రమాదం అనే భావన యాజమాన్యాల్లో, పాలకుల్లో కలిగించేలా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ.. సింగరేణి, ఆయిల్ సెక్టార్ రంగాల్లో సమ్మె విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ సర్కారుపై నిజమైన దేశభక్తులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశరక్షణ రంగంలోకి ప్రయివేటు, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం దేశ సమగ్రతకు ప్రమాదమని హెచ్చరించారు. దేశభక్తులకు ఇది కనిపించట్లేదా? అని అడిగారు. బిజెపి నాయకులు పైకి దేశభక్తి జపం చేస్తూ..కార్పొరేట్లకు సంపదను దోచిపెట్టే దేశద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కార్యాచరణను, కార్మికులు చేయాల్సిన పనిని సోదాహరణంగా వివరించారు. సదస్సులో పి మురళి (బిడిఎల్ అధ్యక్షులు), జి సాంబశివరావు (బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సర్కిల్ కార్యదర్శి), టి సత్తయ్య (బిడిఎల్ ప్రధాన కార్యదర్శి) తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదాం

- మెగాస్టార్ చిరంజీవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని టీవర్క్స్ వద్ద 'నోటి క్యాన్సర్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి వర్చువల్ సందేశం పంపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామన్నారు. వ్యసనాలకు బానిసలై కొందరు తమ కలలను దూరం చేసుకుంటున్నారని చెప్పారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 1496/2024
బిట్వీన్
శ్రీమతి మునిగల రూప ...పిటీషనర్
అండ్
శ్రీ మునిగల వంశీకృష్ణ ...రెస్పాండెంటు
నోటీసు
టు
రెస్పాండెంట్:
శ్రీ మునిగల వంశీకృష్ణ, S/o. ప్రభాకర్ గుప్త, హిందు, వయస్సు: 37 సం॥లు, నివాసం: ప్లాట్ నెం. 69, భీరంగుడ, పటాంచెరు మండలం, షిరిడిసాయి కాలనీ, అమీనాపూర్, మెదక్, తెలంగాణ
ప్రస్తుత నివాసం: హెచ్.నెం. 13-51, షిరిడి సాయి కాలనీ, భీరంగుడ, అపోలో ఫార్మశీ దగ్గర, అమీనాపూర్, సంగారెడ్డి, తెలంగాణ రాష్ట్రం.
పైనెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టుద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 08-05-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు **ఉ॥గం॥10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు ద్వారా గాని పైతెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పైపిటీషన్‌లో మీకుఎటువంటి ఆక్షేపణలు లేవనిభావించి శ్రీ కోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
(By order of the Hon'ble Court)
GALI RAMI REDDY, Advocate
Visakhapatnam. **Cell: 90004 81960**

IN THE COURT OF HON'BLE MACT-CUM-VIII ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT :: AT L.B. NAGAR
O.P. No. 224 of 2022.
Between:
K. Bhanu Chandar Goud .....Petitioner
AND
Gurram Prathap Reddy & others ......Respondents
NOTICE
To
(R1) **Gurram Prathap Reddy**, S/o. G. Janardhan Reddy, Age: Major, owner of vehicle no. AP 15TC 3905, R/o. H.No.2-3-387, Plot No.34, Road No.4, Sri Sainagar Colony, Nagole, Saroornagar, Hyderabad.
Please take notice that the above named petitioner has filed the above OP case against you & others for grant of compensation U/s. 166 of MV Act due to injuries sustained to him in the road accident occurred on 26-09-2022 at about 10.30 A.M. That the above case posted on 28-04-2025 at about 10:30 A.M for your appearance. If you fail to attend before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absence as per Law.
//BY ORDER OF THE COURT//
B. SOMAIAH
B.MAHESH
Advocates
Office at 4-9-530, Raja Rajeswari colony, Hayathnagar, R.R.District.

సిఎం రేవంత్‌తో కితాక్యూషూ మేయర్ భేటి

- సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అక్కడి కితాక్యూషూ మేయర్ కజుహిసా టకేచీని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సిఎంకు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు, అధికారులకు, బృందంలోని ఇతర సభ్యులకు అక్కడి సాంప్రదాయ పద్ధతిలో మేయర్ ఘనంగా స్వాగతం పలికారు. కితాక్యూషూ అనేది జపాన్‌లో ఒకప్పుడు అత్యంత కాలుష్యంతో కూడిన నగరం. అక్కడి గాలీ, నీరూ, నేలా విషపూరితంగా ఉండేవి. ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

పిసి ఘోష్ కమిషనే ఆధారం

- ఆ సిఫార్సుల మేరకే చర్యలు
- విజిలెన్స్ నివేదికపై ఎలాంటి చర్యలూ వద్దని ప్రభుత్వం నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఘటనపై ప్రభుత్వం నియమించిన పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధానంగానే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిన్ణయించినట్లు తెలిసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికను ప్రస్తుతానికి పక్కన బెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలున్నట్టు సమాచారం. మరోవైపు నేషనల్ డ్యాం సేఫ్టీ అథార్టీ (ఎన్‌డిఎస్‌ఎ) నివేదిక ఇప్పటివరకు రాకపోవడంతో.. దెబ్బతిన్న బ్యారేజీలకు వచ్చే వర్షాకాలంలోగా ఎలాంటి మరమ్మతులకు అవకాశం లేదు. నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చి నెలన్నర రోజులైంది. ముఖ్యమంత్రి, మంత్రి కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఆ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 30న ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనిల్ జైన్‌తో తెలంగాణ డ్యాం సేఫ్టీ ఇంజనీర్లు, నీటిపారుదలశాఖ అధికారులు సమావేశం కానున్నారు. ఆ సమావేశంలో నివేదిక విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్‌డిఎస్‌ఎ నివేదిక వచ్చిన తర్వాత.. చేయాల్సిన మరమ్మతులకు సంబంధించి డిజైన్లు సిద్ధం చేసుకొని పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సమయం పడుతుంది. జూన్ ఒకటి నుంచి వర్షాకాలం ప్రారంభమవుతుంది. రెండు లేదా మూడో వారం నుంచి ప్రాణహిత నదిలో ఎంతో కొంత వరద ప్రవాహం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ మరమ్మతు పనులు ప్రారంభించడం వీలుకాదు. గత ఏడాది ఎన్డీఎస్ఏ చేసిన సిఫార్సు మేరకు సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల గేట్లన్నీ ఎత్తి ంచాల్సి ఉంటుంది. జస్టిస్ పిసి ఘోష్ ఈ నెల 23న హైదరాబాద్ రానున్నారు. విజిలెన్స్ నివేదికను కూడా పరిగణనలోకి తీసుకుని.. ఆయన కొందరిని విచారిస్తారని తెలుస్తోంది. కాళేశ్వరం నిర్మాణ సమయంలో ఉన్న ప్రభుత్వంలోని బాధ్యులను విచారణకు పిలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు. విజిలెన్స్ నివేదికలో 17 మందిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్, ఇంకొందరిపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసింది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీపై క్రిమినల్ చర్యలతోపాటు బ్యారేజీ పునరుద్ధరణకు అయ్యే వ్యయాన్ని కూడా ఈ సంస్థ నుంచి వసూలు చేయాలని కూడా పేర్కొంది. గతంలో నీటిపారుదలశాఖ, నిర్మాణ సంస్థ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినపుడు.. ఈ సంఘటనకు తాము బాధ్యులం కాదని నిర్మాణ సంస్థ పేర్కొంది. విజిలెన్స్ నివేదికను జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌కు కూడా ఇచ్చినందున.. కమిషన్ ఇచ్చే సిఫార్సు మేరకు ఒకేసారి నిర?యం తీసుకుంటే సరిపోతుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు నీటిపారుదలశాఖ వర్గాలు చెబుతున్నాయి. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. మరో నెల రోజుల పాటు గడువు పొడిగించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. మే నెలలో కమిషన్ తుది నివేదికను సమర్పించనుంది.

పెన్షనర్ల సంఘం నాయకులు ఎల్‌డి ప్రసాద్ సేవలు మరువలేనివి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్ల సంఘం నాయకులు ఎల్‌డీ ప్రసాద్ సేవలు మరువలేనివని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. శనివారం ఆనారోగ్యంతో ఎల్‌డి ప్రసాద్ మరణించిన విషయం తెలుసుకున్న ఎస్. వీరయ్య, సిపిఎం నాయకులు హెచ్‌ఎంటీ హిల్స్‌లోని ఎల్‌డీ ప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం కూకట్‌పల్లి మండల కమిటీ సభ్యులు, హైదర్ నగర్ శాఖ కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం, పెన్షనర్ల హక్కుల కోసం నిలబడటానికి ఎల్‌డీ ప్రసాద్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన మృతిపై సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డీజీ నరసింహారావు మాట్లాడుతూ.. చివరి వరకు తాను నమ్మిన ఆశయాల సాధన కోసం ఎల్‌డీ ప్రసాద్ పని చేశారని తెలిపారు. ఆశయ సాధన కోసం నిలబడటమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి సత్యం, పెన్షనర్ల సంఘం అఖిలభారత కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ ఎమ్ఎన్ రెడ్డి, మాట్లాడుతూ.. ప్రసాద్ చివరి శ్వాస వరకు ప్రజా సేవకు అంకితమై పనిచేశారని కొనియాడారు. తన మరణం అనంతరం అంత్యక్రియలు పార్టీ పద్ధతుల్లో జరపాలని కోరుకున్నారని, వారి కోరిక మేరకు కుటుంబ సభ్యులు అంగీకరిం చడం అభినందనీయమన్నారు. ఆయన నేత్రదానం చేయడం ఆదర్శనీయమని అన్నారు. నాయకులు ఆర్.వరప్రసాద్, సిపిఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు నివాళులర్పించారు.

ఎల్‌డి ప్రసాద్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎస్ వీరయ్య తదితరులు

డ్రగ్స్ సరఫరా నిందితులను శిక్షించేందుకు.. పోలీసులకు పూర్తి అధికారాలివ్వాలి

- టి స్కైలాల్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ముఠాలను, సేవిస్తున్న నిందితులను కఠినంగా శిక్షించేందుకు పోలీసులకు పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారాలు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్ యాప్స్‌ను నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం రాత్రి వలిగొండ మండలంలోని పులిగిల్లకు, ఆదివారం ఉదయం కేర్చుపెల్లి, వెలువర్తి, వలిగొండ గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు వాడుతున్నవారితో పాటు వాటిని సరఫరా చేస్తున్నవారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని చెప్పారని గుర్తు చేశారు. వారిని గుర్తించి కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం పోలీసులకు పూర్తిస్థాయి అధికారాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైన అనేకమంది నిందితులకు శిక్షలు పడకుండా రాజకీయ జోక్యాన్ని ప్రదర్శిస్తున్నారని, దీనివల్ల రోజురోజుకు డ్రగ్స్, గంజాయి కేంద్రంగా రాష్ట్రం మారుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై, వాటిని సేవిస్తున్న వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకుండా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు బారిన పడ్డ వారిని సహించకుండా పోలీసులకు సమాచారాన్ని ఇచ్చి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, బిసి సంక్షేమ సంఘం, కెవిపిఎస్, ఐద్వా, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పులిగిల్ల మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శీలం స్వామి, జిల్లా కార్యదర్శి బత్తిని రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆఫ్‌లైన్ బెట్టింగ్..!

- ఆన్‌లైన్ యాప్‌లపై నిఘాతో పాతపద్ధతిలోనే దందా
- ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో మకాం
- గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం
- ఐపిఎల్ నేపథ్యంలో రూ.కోట్లలో దోపిడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేయడంతో బెట్టింగ్ రాయుళ్లు మళ్లీ పాత పద్ధతినే ఆశ్రయిస్తున్నారు. ఐపిఎల్ నేపథ్యంలో ఆఫ్‌లైన్ బెట్టింగ్ పై దృష్టిసారించారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో మొహరించిన బుకీలు రూ. కోట్లలో బెట్టింగ్ రూపంలో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పోలీసుల కండ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిపిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎపి సరిహద్దు సత్తుపల్లి, అశ్వారావు పేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, ఖమ్మం, వైరా తదితర ప్రాంతాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట, నల్లగొండ, కోదాడ, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుకీలు మకాం వేసి ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ యాప్‌లలో ఎక్కువగా బెట్టింగ్‌కు పాల్పడే వారి వివరాలు సేకరించి వారిని ఆఫ్‌లైన్ బెట్టింగ్ వైపు మరల్చుతున్నారు.

మళ్లీ అవే అడ్డాలు..

ఐపీఎల్ సీజన్ మొదలైన కొత్తల్లో చాయ్‌కేఫ్‌లు, రెస్టారెంట్లు, లాడ్జీలను అడ్డాలుగా చేసుకుని బుకీలు తమ దందా కొనసాగించేవారు. కొంతకాలానికి ఆన్‌లైన్ బెట్టింగ్‌ల పేరుతో కొత్తకొత్త యాప్‌లను సృష్టించి ఉన్నచోటి నుంచి కదలకుండా మూడు పువ్వులు.. ఆరుకాయలుగా.. తమ బెట్టింగ్ అక్రమార్జనను కొనసాగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో యువత తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో ఆన్‌లైన్ యాప్‌లపై గట్టి నిఘా ఉంచింది. దాంతో చాలా మంది బెట్టింగ్ రాయుళ్లు వెనక్కి తగ్గారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ -2025 సీజన్ మొదలవటంతో తమకు గతంలో అడ్డాలుగా ఉన్న చాయ్‌కేఫ్‌లు, రెస్టారెంట్లు, లాడ్జీల్లో మకాం వేసి పాతపద్ధతిలోనే బుకీలు దందాకు తెరలేపారు.

గుట్టుచప్పుడు కాకుండా..

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు వచ్చినప్పటి నుంచి దాదాపుగా ఆఫ్‌లైన్ బెట్టింగ్ వ్యవహారం చాలా వరకు తగ్గింది. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా అంతగా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై దృష్టిసారించలేదు. ప్రభుత్వ ఆదేశాలతో తాజాగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై పోలీసులు నిఘా ఉంచారు. ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై పెద్దగా నిఘా లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన బుకీలు గుట్టుచప్పుడు కాకుండా దందా కొనసాగించేందుకు సమాయత్తం అయ్యారు. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోకి అడుగుపెట్టారు. పోలీసుల కండ్లు గప్పి తమ కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న గుజరాత్, రాజస్థాన్ వ్యాపారుల్లో బెట్టింగ్ వ్యసనపరులను ఆశ్రయించి వారి ద్వారా దందా కొనసాగిస్తున్నారని సమాచారం.

ఆన్‌లైన్ తరహాలోనే ఆఫ్‌లైన్‌లోనూ..

గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆఫ్‌లైన్ బెట్టింగ్‌కు చాలా వ్యత్యాసం ఉండేది. ఆన్‌లైన్ బెట్టింగుల్లో ఉండే సౌకర్యం ఆఫ్‌లైన్‌లో ఉండేది కాదు. కానీ ఆ సౌలభ్యాన్ని ఆఫ్‌లైన్‌లోనూ కల్పిస్తూ ఈ దిశగా యువత దృష్టి సారించేలా బుకీలు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రెండు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో మొదట ఏ జట్టు గెలుస్తుందని ఆఫ్‌లైన్‌లో బెట్ వేస్తామో.. చివరి వరకు దానికే కట్టుబడి ఉండాలి. కానీ ఆన్‌లైన్‌లో అలా కాదు మ్యాచ్ జరుగుతున్న తీరును బట్టి.. ఫలానా జట్టు గెలుస్తుందని అంచనా వేస్తూ బెట్టింగ్‌కు పాల్పడవచ్చు. మ్యాచ్ చివరి బంతి వరకు కూడా అంచనాను మార్చుకుంటూ పందెం వేయొచ్చు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనూ ఆన్‌లైన్ తరహా పద్ధతులను ప్రవేశపెట్టి బుకీలు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఉత్కంఠగా సాగిన సన్‌రైజర్స్ వర్సెస్ పంజాబ్, డీసీ -ఆర్ఆర్, లక్నో- ఆర్ఆర్ మ్యాచ్‌ల సందర్భంగా రూ.కోట్లలో డబ్బులు చేతులు మారినట్టు తెలుస్తోంది.

ఎస్‌పిఇ చట్టం 1976ని పరిరక్షించాలి

- అమ్మకాలు, ప్రమోషన్ ఉద్యోగుల కోసం చట్టబద్ధ పనినియమాలు రూపొందించాలి
- మే 20న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలి : టిఎంఎస్ఆర్‌యు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, ఎస్‌పీఈ చట్టం-1976ని పరిరక్షించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్(టీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. భానుకిరణ్, ఉపాధ్యక్షులు ఐ.రాజుభట్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీఎమ్ఎస్ఆర్‌యూ కార్యాలయంలో మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అమ్మకాలు, ప్రమోషన్ ఉద్యోగుల కోసం చట్టబద్ధమైన పని నియమాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య ప్రతినిధుల ప్రవేశంపై నిషేధాన్ని తొలగించాలని కోరారు. మందులతో పాటు నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. స్వయం సమృద్ధి కోసం ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీలను పునరుద్ధరించాలని విన్నవించారు. కల్తీ, నకిలీ మందుల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన అమ్మకాల ప్రమోషన్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ప్రకటించాలని కోరారు. అమ్మకాలను పెంచాలనే వేధింపులను యాజమాన్యాలు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్ఎస్ఆర్‌యూ కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు విద్యాసాగర్, సదానందచారి, జి.శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MACT: CUM III ADDL. DISTRICT JUDGE: RANGAREDDY. DISTRICT. AT: L B NAGAR.
MVOP.NO. 424 OF 2023
Between:
Sandeep Prasad, ...**PETITIONER**
AND
D. Jaya Raju & Others, ...**RESPONDENTS**
1. Dola Jayaraju, S/o. Late Dola Ramulu, Aged about 48 years, Occ: Driver of the crime vehicle, R/o. 3-93/A, Polasanapalle Village, Nuziveedu Mandal, Krishna District, Andhra Pradesh State, Cell: 9912579619, Pin code: 521 111,
...Respondent. No.1
NOTICE
Please take notice that in the above matter the Petitioner had filed case against you (Respondent No.1) for compensation for Rs.40,00,000/- and the same is posted for your appearance on 22-04-2025. You are advised to appear on 22-04-2025 at 10.30 A.M. before the said court either in person or through an Advocate failing which, the case will be decided Exparty.
(BY THE ORDER OF THE COURT)
P. THIRUPATHI
Advocate
H. No. 11-12-636, Boudhanagar, Warasiguda, Secunderabad – 500 061, Mob: 9701413287.

ప్రమాదంలో మహిళలు, దళిత, గిరిజన హక్కులు

- మోడీ పాలనలో దేశంలో మహిళలకు భద్రత కరువు
- 33 శాతం రిజర్వేషన్ల అమలుకు వెనకాడుతున్న మోడీ
- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

మహిళా హక్కుల పరిరక్షణ ముగింపు సభలో మాట్లాడుతున్న టి జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ పాలనలో మహిళలు దళిత, గిరిజనుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని, ముఖ్యంగా మహిళలకు భద్రత లేకుండా పోయిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షులు టి. జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణ కోసం జ్యోతిరావు పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 14న ప్రారంభమైన "పూలే అంబేద్కర్ యాదిలో.. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర" రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో పర్యటించి ఇబ్రహీంపట్నంలో ముగిసింది. ముందుగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో టి. జ్యోతి, మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే సమయంలో నాటి పాలకులు అడ్డుకుంటే తన మంత్రి పదవినే తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది మహిళా వీరమణులు పోరాడి సాధించుకున్న మహిళా హక్కులు నేడు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం, మహిళల హక్కులను పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందన్నారు. భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మాన్ని అమలు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మహిళలు, బాలికలపై లైంగికదాడులు, హత్యలు పెరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో సమాచారం ప్రకారం ప్రతి 17 నిమిషాలకు ఒక ఘటన చొప్పున రోజుకు 86 మంది మహిళలపై అఘాయత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళల నిష్పత్తి తగ్గుతుందని, కుల దురంకార హత్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అందడం లేదన్నారు. మహిళలకు ఉపాధి కరువైందని తెలిపారు. బేటి బచావో.. బేటి పడావో అని మోడీ అంటునారే.. తప్ప మహిళలపై జరుగుతున్న దాడుల గురించి మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు.

కతువా, హత్రాస్, ఉన్నావో, మణిపూర్ ఘటనలో బీజేపీ మంత్రులు నిందితుల పక్షాన ఉండి వారిపై కేసులు పెట్టొద్దు అంటూ ప్రదర్శనలు చేసిన ఘనత కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. బిల్కీస్ భానోపై లైంగికదాడి, ఆమె కుటుంబీకుల హత్య కేసులో నేర నిర్ధారణ జరిగి జీవిత ఖైదీ అనుభవిస్తున్న 11 మందిని విడుదల చేయించడమే కాకుండా శాలువాలతో సత్కరించారని విమర్శించారు. బీజేపీ పాలిత మణిపూర్‌లో నడిబజారులో మహిళను నగ్నంగా ఊరేగించిన ఘటనను గుర్తుచేశారు. రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు బ్రిజ్ భూషణ్‌సింగ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డా కనీసం అతన్ని బీజేపీ ప్రభుత్వం శిక్షించ లేదని, ఇది బీజేపీ నిజస్వరూపమని తెలిపారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే బాధితుల పక్షాన నిలవకుండా హంతకుల పక్షాన మోడీ ప్రభుత్వం నిలుస్తోందని విమర్శించారు. మహిళల్లో మూఢనమ్మకాలను పెంచేందుకు కొత్త కొత్త రూపాల్లో తన విధానాలను అమలు చేయాలని చూస్తుందన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతామని ప్రజాస్వామ్యాన్ని పునర్జీస్తోందని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మాట తప్పిందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు చేస్తున్న పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తుందని తెలిపారు. మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, మహిళల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ఐద్వా ఉద్యమిస్తుందని స్పష్టంచేశారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న హింసను, లైంగిక వేధింపులను అరికట్టి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో, కాలేజీల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలన్నారు. ఓటీటీ, వెబ్‌సైట్ సీరియల్స్ వల్ల పిల్లలపై ప్రభావం పడుతోందని, దీన్ని బ్యాన్ చేయాలని కోరారు. గంజాయి, మద్యం, బెల్ట్ షాపుల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కులాంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అనేక ప్రజా వ్యతిరేక విధానాలపై మహిళలోకం చైతన్యం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మహిళా హక్కుల పరిరక్షణ, దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కోసం ఉద్యమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, సహాయ కార్యదర్శులు ఆశాలత, సరళ, కోశాధికారి భారతి, రాష్ట్ర నాయకులు నాగలక్ష్మి, శశికళ, సాయిలీల, వినోద, గీత, వరలక్ష్మి, అనురాధ, జిల్లా కార్యదర్శి సుమలత, జిల్లా నాయకులు కవిత, అరుణ, ఇందిరా, మున్నీ, ఉమ, షఫీ ఉన్నిసా బేగం, మమత, స్వప్న, బలమణి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ గో బ్యాక్

- నేడు నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో భారతదేశం వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపలు పట్టడం వంటి అంశాలపై అమెరికాతో అసమాన ఒప్పందాలు చేసుకోబోతున్నదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. ఈ నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వాన్స సోమవారం మన దేశానికి వస్తుండటంతో 'వాన్స గో బ్యాక్' భారతదేశం అమ్మకానికి లేదు అనే నినాదంతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చింది. ఈమేరకు శనివారం ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, వి.ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, కొండల్, పెద్దారపు రమేష్, నాగిరెడ్డి, ఆర్.వెంకట్ రాములు, కాంతయ్య, రామకష్ట తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు, దిష్టి బొమ్మల దహనం కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ సరిహద్దులకు అతీతంగా భారతీయులందరూ ఐక్యంగా ఉండి 'సైమన్ గో బ్యాక్' నినాదమిచ్చినట్టుగానే, ఇప్పుడు 'వాన్స గో బ్యాక్. భారతదేశం అమ్మకానికి లేదు' అంటూ నినదించాలని కోరారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదం ముందు పూర్తిగా లొంగిపోయిందని విమర్శించారు.

మణికొండలో వాల్యూ గోల్డ్ కొత్త శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరానికి చెందిన కాప్స్ గోల్డ్ కి చెందిన వాల్యూ గోల్డ్ ఆదివారం పుప్పాలగూడ, మణికొండలో తమ 6వ శాఖను ప్రారంభించింది. తమ ఏడవ శాఖను ఏ.ఎస్.రావునగర్ లో ఈనెల 23న తెరువనున్నట్లు ప్రకటించింది. మరో 3,4 బ్రాంచ్‌లు రాబోయే కొద్ది నెలల్లో ప్రారంభంకానున్నాయని మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ చందా తెలిపారు. తమ విలువైన కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.

బిఆర్ఎస్‌లో సమన్వయ లోపం

- ఐక్యతను విస్మరించిన సత్యవతి రాథోడ్ • ఎమ్మెల్సీ రవీందర్రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్రావు

పోరాటాల పురిటి గడ్డ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు ఉన్న మానుకోట బిఆర్ఎస్‌లో సమన్వయ లోపం ఉన్నదని, అది స్పష్టంగా కనిపిస్తుందని అయినా పార్టీ సమన్వయకర్త, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. అనేక మంది ఈ ప్రాంతాల నుంచి ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారని, పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని అన్నారు. కానీ ఉద్యమకారులను, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో నాయకత్వలోపం ఉన్నదని అన్నారు. ఎవరికి వారే యమునా తీరే అని పోవడం సరైనది కాదన్నారు. మానుకోట బీఆర్ఎస్‌ను సమన్వయం చేయమని కేసీఆర్.. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను ఆదేశించారని, కానీ ఆమె సమన్వయ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టివ్వాలి

- అసైన్డ్‌మెంట్ కమిటీల్లో పార్టీలకు, వ్యకాస సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి : జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించే అసైన్డ్‌మెంట్ కమిటీల్లో రాజకీయ పార్టీలకు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూమి ఉందనీ, దానిలో ఎక్కువ భాగం అన్యాక్రాంతమైందని వాపోయారు. దానిపై పేదలకు హక్కు కల్పించాలంటే పేదల పక్షాన పోరాడే పార్టీలకు, సంఘాల నాయకులకు అసైన్డ్‌మెంట్ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన పేదలకు న్యాయం దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో లక్ష మంది పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని కొన్నేండ్లుగా జీవనం సాగిస్తున్నారనీ, వాటిని రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చేయడం సరిగాదని చెప్పారు. ప్రశ్నించే, అడ్డుకునే గుడిసెవాసులను అక్రమ అరెస్టులు చేసి జైళ్లకు పంపడం దుర్మార్గమన్నారు. పేదలపై ప్రతాపం చూపుతున్న అధికారులు.. అసైన్డ్ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఎత్తిచూపారు. రియల్టర్ల చేతిలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలనీ, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల అదనపు సహాయం పిఎంఎవై పథకం కింద ఇవ్వాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరాలలో పఠనాశక్తి పెంచాలి

ప్రజాశక్తి కల్చరల్

కథలు కవిత్వం తెలుగు నాట విరివిగా వస్తున్నా నేటి తరాలలో చదువరులు తక్కువ గా వున్నారని వారిలో పఠనాశక్తి పెంచాలనీ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరం ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో మూడు పుస్తకాలు ఆవిష్కరణ సభ జరిగింది సినీ దర్శకుడు ఉమా మహేశ్వర రావు అతిథిగా హాజరై పలమనేరు బాలాజీ రచించిన లోపలేదో కదులుతున్నట్లు కవితా సంపుటి నీ ఆవిష్కరించి మాట్లాడారు బాలాజీ కవితలు లో శిల్పం శైలి ఆలోచనలు కలిగించే విధం గా వున్నాయని అన్నారు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు చిన వీరభద్రుడు అతిథిగా పాల్గొనీ కథా ప్రపంచం ను ఆవిష్కరించి మాట్లాడారు ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కథల పోటీలు నిర్వహించి రచయితలను ప్రోత్సహిస్తోంది అన్నారు పోటీలలో బహుమతులు పొందిన కథలను గ్రంథ రూపం లో అందించి పాఠకులకు అందించటం అభినంద నీయం అన్నారు జొన్నవిత్తుల శ్రీ రామచంద్ర మూర్తి రచించిన సాక్షాత్కారం నవలను ప్రముఖ నవలా రచయిత వాసిలి వసంత కుమార్ ఆవిష్కరించి నవల ఆసాంతం చదివించే విధం గా వుందని అభినందించారు వేదిక పై మలిశెట్టి సీతారాం స్మారక పురస్కారం ప్రముఖ కవి జుజ్జూరి వేణు కు సినీ దర్శకుడు ఉమా మహేశ్వర రావు సంస్థ పక్షాన అందజేశారు రచయితలు చీకోలు సుందరయ్య రోహిణి గండికోట వారిజ వేమూరి సత్యనారాయణ తదితర రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరుల త్యాగాల ఫలితమే.. నేడు సంక్షేమ పథకాలు

- ట్రైకార్ ద్వారా ట్రాక్టర్ల పంపిణీ
- ఐకెపి ద్వారా వడ్డీ లేని రుణాలు : మంత్రి సీతక్క
- ఇంద్రవెల్లి అమరులకు ఘన నివాళి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆనాడు భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగ ఫలితమే నేడు ఆదివాసులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తున్నదని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం ఆమె శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల స్థూపం ఆవరణలో తెల్లటి వస్త్రంతో ఎరుపు రంగును పూసి జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద పూలను వేసి ఘన నివాళులు అర్పించారు. అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలకు ట్రైకార్ ద్వారా మంజూరైన ట్రాక్టర్లు, బొలెరో వాహనాన్ని అందజేశారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల సైన్స్ ల్యాబ్, ఫర్నిచర్ వితరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. 1981 ఏప్రిల్ 20న సంఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పడం జరిగిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో స్థూపానికి రూ. కోటితో స్మృతి వనం, వారి కుటుంబాలకు ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించి తీరుతామన్నారు. అనంతరం మంత్రి చేతులమీదుగా ఐకేపీ మహిళా గ్రూపులకు రూ.కోటి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటిడిఎ పిఒ ఖుష్బు గుప్తా, ఎస్‌పి అఖిల్ మహాజన్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆత్రం సుగుణ, డిఎఫ్ఒ ప్రశాంత్ పాటిల్, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్ పాల్గొన్నారు.

బిసిలను పట్టించుకోని మోడీ సర్కార్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను చిత్తశుద్ధితో అమలు చేయాలి
- ఎస్‌వికె వెబినార్‌లో పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ బిసిల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల ఆశయ్య విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "ఎస్‌సి, బిసి వర్గీకరణను స్థానిక ఎన్నికలకు వర్తింపజేయాలి" అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు గత బడ్జెట్లో రూ.11 వేల కోట్లు కేటాయిస్తే, కేంద్రం మాత్రం కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. సంచార జాతులను ఇబిసిలుగా, వృత్తికులాలను ఎంబిసిలుగా, వ్యవసాయ కులాలను ఒబిసిలుగా వర్గీకరించాలని రోహిణి కమిషన్ చేసిన సిఫార్సులను కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిఎన్‌టి కమిషన్ రిపోర్టును కూడా పక్కకు పెట్టిందని పేర్కొన్నారు. జనాభాలో సగానికిపైగా ఉన్న ఈ తరగతులకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లలో 50 శాతం వాటా దాటితే దాని అమలు కేంద్రం చేతుల్లోకి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తిరకాసును అడ్డం పెట్టుకుని మోడీ సర్కార్ బీసీల రిజర్వేషన్లు కల్పించే రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్లో నిధులు పెంచాలనీ, జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం బీసీ, ఎస్‌టి, ఎస్‌సి వర్గాలకు కలిపి మొత్తం 62 శాతం చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నదని గుర్తు చేశారు. రిజర్వేషన్ల అమలుపై ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించి 9వ షెడ్యూల్లో చేర్చిందని అన్నారు. మన రాష్ట్రంలో సైతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 130కి పైగా బిసి కులాలుండగా, అందులో 60 కులాలకు చెందిన వారు ఇప్పటి వరకు గ్రామపంచాయతి మెట్లెక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చేశామని చేతులు దులుపు కోకుండా వాటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేయాలని సూచించారు. విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల్లోనూ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణకు చట్టపరమైన అడ్డంకులు తొలిగిన నేపథ్యంలో వారికి కేటాయించిన వాటాను న్యాయంగా అమలు చేయాలని సూచించారు. ఈ వెబినార్‌కు ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ ఏడాదిలోనే ఉప ఎన్నికలు..

- సిద్ధంగా ఉండండి...: కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజవర్గాల్లో ఈ యేడాదే ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులన్నీ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత శ్రీరామ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 420 మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్... అడ్డదారిన గద్దెనెక్కిందని దుయ్యబట్టారు. ఆ ఎన్నికల్లో హస్తం పార్టీ స్థానిక నేతలను ప్రజలు నమ్మటం లేదని, ఢిల్లీ నుంచి అగ్రనేతలను తీసుకొచ్చి డిక్లరేషన్లు ఇప్పించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతల మాటలు పెద్దగా ఉంటాయి.. కానీ చేతలు మాత్రం చిన్నవంటూ విమర్శించారు. ఆ పార్టీ నేతల ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్నా సీఎం రేవంత్ పట్టించుకోరనీ, కానీ హైడ్రా పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో తనకు భూములున్నాయంటూ ఆరోపిస్తున్న అధికార పార్టీ నాయకులు.. అవి ఎక్కడున్నాయో చూపాలంటూ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ ఇచ్చిన హామీల అమలుకు నిధుల్లేవుగానీ...మూసీ ప్రక్షాళనకు మాత్రం లక్ష కోట్లు ఖర్చు చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రకంగా చూస్తే ఫిబ్రవరిలో 31వ తేదీ ఉండదనేది ఎంత నిజమో.. రేవంత్ మాటలు కూడా అంతే నిజమని ఆయన వ్యాఖ్యానించారు.

ఎట్టి పరిస్థితుల్లో వక్ఫ్ బిల్లు అమలు కానివ్వం

- ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్
- వక్ఫ్ బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎట్టి పరిస్థితుల్లో వక్ఫ్ బిల్లును అమలు కానివ్వం అని, చట్ట ప్రకారం కోర్టుల ద్వారా అడ్డుకుంటామని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరణ చేయడాన్ని ఖండించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని ముస్లిం మైనార్టీ సమాజాన్ని బలహీనపరిచేలా కేంద్రం కుట్రపన్నుతోందని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు చట్టం సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఆదివారం నిజామాబాద్ నగరంలో వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో సొంత ఖర్చులతో పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు. వక్ఫ్‌బిల్లు చట్టబద్ధతపై సుప్రీంకోర్టులో విచారణ మొదలు పెట్టిందని, కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ వివరణ కోరిందని తెలిపారు. ఆర్టికల్ 25, 26కు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపామని అన్నారు. ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్‌కు ఇచ్చారని ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని.. సవరణ తర్వాత హిందువులు కూడా భాగం కావొచ్చని తెలిపారు. ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై పూర్తి నమ్మకం ఉందని, తప్పకుండా తమకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

లారీలో తరలిస్తున్న గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లారీలో తరలిస్తున్న రూ.2.32 కోట్లు విలువ చేసే గంజాయి అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. అశ్వారావుపేట సిఐ కరుణాకర్ విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట శివారులోని జంగారెడ్డిగూడెం రహదారిలో ఉన్న అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శనివారం ఎస్ఐ యయాతి రాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఎపి నుంచి తెలంగాణాలోకి ఖాళీగా వస్తున్న లారీని పోలీసులు ఆపగా అందులో ఉన్న మధ్యప్రదేశ్‌లోని అగర్ మాల్వాకు చెందిన ముఖేశ్ సూర్య వంశీ, రాజేశ్ గుర్జార్, సాలగ్రామ్ గుర్జార్‌లు కంగారు పడ్డారు. దీంతో అనుమానించిన పోలీసులు తనిఖీ చేయగా లారీ క్యాబిన్ లోపల, క్యాబిన్‌పైన 216 ప్యాకెట్లలో ఉన్న 463.740 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏపీలోని విజయనగరం నుంచి మధ్యప్రదేశ్‌లోని అగర్ మాల్వా ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్లు వారు తెలిపినట్లు సిఐ వివరించారు.

ఉపాధి పనుల్లో అవినీతి

రూ.1.51 కోట్లు స్వాహా
సామాజిక తనిఖీల్లో బట్టబయలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,474 పనులకు సంబంధించి రూ.1.51 కోట్లు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో తేలింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.77 లక్షలకే పరిమితమైన అవినీతి ఈసారి రెట్టింపు కావడం గమనార్హం. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందితో కొందరు పైస్థాయి అధికారులు చేతులు కలపడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారుల తనిఖీలో బయటపడింది గోరంతే. కొలతల్లో తేడా, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘన పేరిట రూ.10 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఉపాధి హామీ పథకంలో గతేడాది వ్యవసాయ భూముల అభివృద్ధి, చెరువులు, కందకాల తవ్వకం, వన మహోత్సవం, నీటి వనరులను పెంపొందించడం, ఇతరత్రా రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి.

స్లాట్‌తో రిజిస్ట్రేషన్లు సులభం

- రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ప్రణాళికలు
- కొత్త కార్యాలయాల నిర్మాణానికి కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్న స్లాట్ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని అధికారులు అంచనాకు వచ్చారు. గతంలో దస్తావేజులు తీసుకుని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, కావాల్సిన ఆధారాలన్నీ పరిశీలించుకుంటే రిజిస్ట్రేషన్ ఎప్పుడనేది తేలేది కాదు. ఫలనా రోజున రావాలని అధికారులు చెబితే చెట్ల కిందనో.. కార్యాలయం ముందో గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చేది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానం ఇందుకు భిన్నం. ఒకసారి ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకుంటే కంప్యూటర్ కేటాయించిన సమయానికి వెళితే లావాదేవీ పూర్తవుతోంది. అందుకే వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 122 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని ఆ శాఖ భావిస్తోంది.

ఈ మేరకు ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు అమలవుతున్న 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించిన లావాదేవీలను, ఎదురవుతున్న అవాంతరాలను, సాంకేతికపరమైన అంశాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.

రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల రిజిస్ట్రార్ల పరిధిలో షిఫ్ట్ విధానం అమలు చేసే ప్రణాళికలు ఉన్నాయి. ఈ మూడు జిల్లాల పరిధిలోని చాలా కార్యాలయాలకు రోజుకు సగటున 100 డాక్యుమెంట్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు కేటాయిస్తుండగా ఎక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు వచ్చే కార్యాలయాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని భావిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్నాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది వరకు మరో షిఫ్ట్‌ను అమలు చేయడం ద్వారా పనిభారం తగ్గించడంతోపాటు ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయొచ్చన్న ఆలోచనతో ఉన్నారు. ప్రస్తుతం చంపాపేట, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకీకృత విధానం విజయవంతంగా నడుస్తోంది. వీటిల్లో ఎక్కడ రద్దీ తక్కువగా ఉంటే అక్కడికి స్లాట్ బదలాయింపు ఆటోమేటిక్‌గా జరుగుతోంది. ఇదే విధానాన్ని ఫరూఖ్‌నగర్-షాద్‌నగర్, సంగారెడ్డి-పటాన్‌చెరు-అమీన్‌పూర్, కుత్బుల్లాపూర్-బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేయాలన్న ప్రణాళిక ఉంది.

భూభారతి తరహాలో ఈ-స్లాట్ విధానాన్ని సైతం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తేవడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, సేవల్లో వేగం పెరుగుతుందని రెవెన్యూ శాఖ భావిస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను బలోపేతం చేయడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ముందుగా మౌలిక సౌకర్యాల కల్పనను ప్రారంభించింది. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 38 సొంత, 106 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏటా అద్దె రూపంలోనే రూ.4.32 కోట్లు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా సొంత భవనాలను నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యం విధించారు. దాంతో ఇప్పటివరకు 56 కార్యాలయాలకు భూముల కేటాయింపు పూర్తయింది. శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది.